జగనన్నతోనే పేదల అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- పండుగలా 'జగనన్న సురక్ష'

సి.బెళగల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో పేద ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రం సి.బెళగల్‌లో ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ శేషఫణి, ఈఓఆర్డీ సందీప్, గ్రామ పెద్దల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ బొంత మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోనుతో కలిసి హాజరయ్యారు. 681 మంది సర్టిఫికెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామీణుల అవసరాలను గౌరవిస్తూ పేదల ఇళ్ల వద్దకు అధికార యంత్రాంగాన్ని పంపిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలకు ప్రభుత్వం అందజేస్తున్న సేవలను ఓర్చుకోలేని ప్రతిపక్ష పార్టీ నాయకులు, జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై అనుచవాఖ్యలు చేయడం హేయమైన చర్యఅన్నారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్‌ఎం బాషా, జేసీఎస్ మండల కన్వినర్ సీబీ తుల సీరెడ్డి, రఘురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలోని 5 వ వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ శివశంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, నాయకులు జే.ఆబేలు, ఎల్.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గోరంట్లలో జగనన్న సురక్ష..

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరై 638 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు, కౌలు కార్డులను అందజేశారు. సీనియర్ నేత అమడగుంట్ల క్రిష్టారెడ్డి, గ్రామ సర్పంచు బాలక్రిష్ణ, ఎంపీటీసీ సభ్యులు రవి, మస్తాన్, ఆలయ కమిటీ చైర్మన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: మండలంలోని జూలకల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సుధాకర్ లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచు విద్యావతి, దామోదర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ మాధవీలత, తహసీల్దార్ శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.



సి.బెళగల్‌లో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సురక్షతో పేదల సంతోషం

ఓర్వకల్లు: ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేస్తున్న ధ్రువీకరణ పత్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుట్టపాడు, పూడిచెర్ల గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గుట్టపాడులో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, పూడిచెర్లలో ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆధ్వర్యంలో కొనసాగాయి. పూడిచెర్లలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రభాకర్‌రెడ్డితో పాటు, డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి మండల ప్రత్యేక హోదాలో హాజరయ్యారు. రెండు గ్రామాలలో కలిపి 2,160 మందికి ఉచితంగా వివిధ ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. ఈఓఆర్డీ సుబ్బరాయుడు, వివిధ శాఖల ఇంజనీర్లు, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, ఎంపీటీసీ లక్ష్మీదేవి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

గడివేముల: దళారుల ప్రమేయం లేకుండా పథకాలను సంబంధించిన లబ్ధిని నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ, ప్రతి ఇంటికీ సంక్షేమఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలను తెలుసుకుని వారి నుంచి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.ఈ మేరకు గురువారం 645 వివిధ రకాల ధ్రువ పత్రాలు అందించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్పలు పాల్గొన్నారు.



ఓర్వకల్లులో ధ్రువపత్రాలను అందజేస్తున్న అధికారులు



బిలకలగూడూరు సచివాలయం వద్ద ధ్రువపత్రాలు అందిస్తున్న దృశ్యం

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న క్యాంపులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సూచించారు. గురువారం పర్ల సచివాలయం-2, తడకనపల్లె గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంపులను ఏర్పాటు చేశారు. పర్ల సచివాలయం-2లో 290 మందికి, తడకనపల్లెలో-320 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు హనుమక్క, సాహెరాబీలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో కౌలు రైతుకు ధీమా

సి.బెళగల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాలలో నిర్వహిస్తున్న సదస్సులు వ్యవసాయ భూములను కౌలు చేసుకునే రైతులకు వరంగా మారాయి. జగనన్న సురక్ష కార్యక్రమంతో సీసీఆర్సీలను అందుకున్న కౌలు రైతన్న ధీమ వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన బడేసావు, వీరారెడ్డి, శేఖర్, పెద్ద రాజు అనే రైతులు పొరుగు రైతులకు చెందిన పొలాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. అయితే భూ వివరాలు భూయాజమాని పేరుపై ఉండటంతో పంట నష్టం వచ్చినా, పంట సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సహాయం, సంక్షేమ పథకాలు అందేవి కావు. విషయాన్ని కౌలురైతులు వలంటీర్ల ద్వారా సచివాలయాల ఉద్యోగులకు తెలపడంతో వారు వివరాలను నమోదు చేయగా, గురువారం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమ సదస్సు జరగడంతో, సదస్సులో భాగంగా వీఆర్వోలు శేఖర్, నాగమ్మ, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, కృష్ణప్రసాద్ నాయుడు, వీఏఏ హిమబిందు, ఇతర సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు సీసీఆర్సీలను అందజేశారు. దీనితో రైతులు అధికారులకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపాడు.



సి.బెళగల్‌కు చెందిన కౌలు రైతులకు సీసీఆర్సీ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రభుత్వానికి రుణపడి ఉంటా



నేను కౌలుకు భూమిని సాగు చేసుకుంటున్నాను. అయితే భూమి వివరాలు నా పేరు మీద లేక పోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే సహాయ సహకారాలు నాకు వచ్చేవకాదు. కౌలు కార్డులతో మాలాంటి వాళ్లకు కూడ ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, నష్ట పరిహారం అందుతుందని, జగనన్న సురక్ష కార్యక్రమంలో నమోదు చేసుకుంటే ఎలాంటి డబ్బులు లేకుండా కార్డులను పొందవచ్చని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా తెసుకుని దరఖాస్తు చేసుకున్నాను. ఈ రోజు నాయకులు, అధికారులు, ఉచితంగా కౌలు కార్డును ఇచ్చారు. ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను.

– బడేసావు, కౌలు రైతు, సి.బెళగల్

ప్రకృతి వ్యవసాయం విస్తృతం చేయాలి

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వల్ల కలిగే ప్రయోజనాలు, పథకం ఆవశ్యకతను గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత పరచాలని పథకం రీజనల్ కో-ఆర్డినేటర్ చక్రాల చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో జన్మభూమి గ్రామైక్య సంఘం సభ్యురాలు వీరభద్రబాయి, ఆమె భర్త సుగాలి వెంకటరమణకు చెందిన ఎకరా పొలంలో ప్రధాన పంటగా దేశీ పత్తి(నా బీటీ) రకంతో పాటు, 36 రకాల విత్తనాలను శుద్ధీకరణ చేసి అంతర పంటగా విత్తి, ఘన జీవామృతం వేశారు. పథకం కన్సల్టెంట్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన కార్యక్రమానికి పథకం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రీజనల్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ రైతులు అంతర పంటలను సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చన్నారు. పంటల వైవిధ్యం ఏర్పడడమేగాక, భూమిలో పోషక విలువలు పెరుగుతాయని సూచించారు. పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు కషాయాలు, ద్రావణాల తయారీపై అవగాహన కల్పించాలని సూచించారు. ఏఈఓ భాస్కర్, ఎన్ఎఫ్ఏ అబ్దుల్ బాషిద్, మాస్టర్ ట్రైనర్ ఆంజనేయులు, యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, శివ, లక్ష్మీనారాయణ, రైతులు హుసేన్‌బాషా, కాశీం, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



హుసేనాపురంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేడు విద్యుత్ కోతలు

పాణ్యం: మండల కేంద్రంలో శుక్రవారం చేపట్టనున్న మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ కోతలు విధించనున్నట్లు సబ్ ఇంజనీర్ సుందర్ రాజ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పాణ్యం టౌన్ ఫీడర్ పరిధిలో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, 33 కేవీ పాణ్యం పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, బలపనూరు ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, చిలకల ఫీడర్ ద్వారా ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ కోతలు విధించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యలను పరిష్కరించండి

సి.బెళగల్: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఎంపీడీఓ రాముడును కోరారు. గురువారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మోహన్ ఆధ్వర్యంలో మండల నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు ఎంపీడీఓకు అర్జీ ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రధాన రోడ్లు, బస్టాండ్ ఆవరణ ఆక్రమణకు గురికావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆక్రమణలపై చర్యలు తీసుకుని రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు. అదేవిధంగా సీసీ రోడ్లు, మురుగు కాలువలను నిర్మించాలని, ఎమ్మిగనూరు - గూడూరు ప్రధాన రహదారిని 100 అడుగులు వెడల్పు ఉండేలా విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చిన్న అక్బర్, సోమశేఖర్, వీరాంజనేయులు, జయులు, హనుమంతు తదితరులు ఉన్నారు.



సి.బెళగల్ సమస్యలపై ఎంపీడీఓ రాముడుకు అర్జీ ఇస్తున్న సీపీఎం నాయకులు

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామంలో నేడు (శుక్రవారం) గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి గురువారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు నివేదికలతో కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

26 వాహనాలు స్వాధీనం

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ వద్ద గురువారం రాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ అనలైజర్ ద్వారా పరిశీలించారు. మద్యం తాగి కారు నడుపుతున్న వ్యక్తితో పాటు మరో 25 ద్విచక్ర వాహనదారులను అదుపులోకి తీసుకుని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే జగనన్న సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందజేస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. గురువారం మండలంలోని పులకుర్తి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల వారికి చేకూరిన లబ్ధిని వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని పీఆర్ ఏఈ గంగరాజు, ఎంపీడీఓ చంద్రశేఖర్‌లను ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం

అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ ఇమ్మానేయులు, ఎంపీటీసీ నాగరాజు, లక్ష్మన్న, గిడ్డయ్య, మాధవరావు, గిరి, నాగేంద్ర, సోమశంకర్ యాదవ్‌లు పాల్గొన్నారు.

నూతన కేథలాబ్ మిషన్ ఏర్పాటుకు చర్యలు



కేథలాబ్ మిషన్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కార్డియాలజీలో ఉన్న పాత కేథలాబ్ మిషన్‌ను తొలగించి, దాని స్థానంలో కొత్త మిషన్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, కార్డియాలజి హెచ్ఓడీ డాక్టర్ పి.చంద్రశేఖర్, అనెస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ కొండారెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ రమేష్‌రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ రాజగోపాల్‌రెడ్డితో కలిసి కేథలాబ్ మిషన్ ఏర్పాటు తదితర పనులను పరిశీలించారు.

క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలి



కొత్తకోటలో ప్రైవేట్ పాఠశాలలో తనిఖీ నిర్వహిస్తున్న ఎంఈఓ ఆదామ్‌బాషా

సి.బెళగల్: మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, ప్రభుత్వ ఆదేశాలు పాటించని పాఠశాలలపై చర్యలుంటాయని ఎంఈఓ - 2 ఆదామ్‌బాషా హెచ్చరించారు. గురువారం మండలంలోని కొత్తకోట గ్రామంలో పర్యటించి శ్రీ ఉరుకుంద ప్రైవేట్ పాఠశాలను, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థుల రికార్డులను, అనుమతి పత్రాలను, తరగతుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామంలోని రెగ్యులర్, స్పెషల్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. సీఆర్పీ శ్రీనివాసులు ఉన్నారు.

ఓర్వకల్లు ఎస్ఐ బదిలీ

ఓర్వకల్లు: మండల ఎస్ఐగా పనిచేస్తున్న మల్లికార్జున బదిలీ అయినట్లు గురువారం కర్నూలు రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయినట్లు పోలీసులు తెలిపారు. అనంతపురం జిల్లా, పామిడికి చెందిన మల్లికార్జున ఏడేళ్ల క్రితం ఇక్కడే ట్రైనీ ఎస్ఐగా పనిచేసి, ఆ తర్వాత నాగలాపురం, కోడుమూరు, రుద్రవరం పోలీసుస్టేషన్లలో ఎస్ఐగా పనిచేశారు. అనంతరం 2020 జూన్ 6న తిరిగి ఓర్వకల్లు ఎస్ఐగా బదిలీపై వచ్చారు. మూడేళ్ల పాటు ఇక్కడి ప్రజలకు నిస్వార్థంగా సేవలందించారు. ప్రస్తుతం ఈయన్ను కర్నూలు ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ చేశారు. మల్లికార్జున స్థానంలో కోసిగి ఎస్ఐగా పనిచేస్తున్న రాజారెడ్డిని నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బియ్యం వేలం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వ స్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి సమర్పించిన బియ్యంను గురువారం వేలం వేసినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యంకు వేలం పాట నిర్వహించగా 21 మంది పాటదారులు పాల్గొన్నారు. మిశ్రమ బియ్యాన్ని కేజీ రూ.45 చొప్పున కర్నూలుకు చెందిన ఈ.రామానంద్ హెచ్చు పాడారన్నారు. అలాగే లావు బియ్యం కేజీ రూ.28 చొప్పున బనగానపల్లెకు చెందిన జీత్‌కుమార్ హెచ్చు పాడి దక్కించుకున్నట్లు వెల్లడించారు. పర్యవేక్షణ అధికారి రామాంజినేయశర్మ, గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి, శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరవుతారని, మండల అధికారులంతా తమ తమ ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలని కోరారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి



గడివేముల సచివాలయం-1 నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఈఈ, జెడ్పీటీసీ

గడివేముల: ఆయా ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ డీఈఈ గంగాధర్ ఆదేశించారు. గడివేమలలో నిర్మాణంలో ఉన్న సచివాలయాలతో పాటు, పొలాల రోడ్లను, గడిగరేవుల, మంచాలకట్ట సచివాలయాలను ఆయన గురువారం పరిశీలించారు. గడిగరేవుల జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. డీఈఈ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నాడు-నేడు ద్వారా విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించడంతో పాటు ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుందన్నారు. పనుల్లో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు హెచ్ఎంలు పర్యవేక్షించాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో నాడు-నేడు రెండో దశలో 26 పాఠశాలలకు గాను రూ.7.90 కోట్లు మంజూరుకాగా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు వివరించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లోని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, ఏఈ భాస్కర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

సమస్యల్లో తోడుగా..

మండలంలోని ముడుమాల గ్రామంలో వలంటీర్ కురువ సోమప్ప ప్రజలకు ఎల్లావేళలా తోడుగా ఉంటున్నాడు. తన తన క్లస్టర్ - 9 పరిధిలోని 76 కుటుంబాలకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ముందుండి చూసుకుంటున్నాడు. రెండేళ్ల క్రితం కోవిడ్ తీవ్రంగా ఉన్న రోజులలో ప్రతిరోజు క్లస్టర్‌లో తిరుగుతూ, ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటూ, కోవిడ్ నియంత్రణ పట్ల జాగ్రత్తలపై చర్యలు తీసుకున్నాడు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలుంటే వైద్య సిబ్బందితో చర్చించి, కోవిడ్ అనుమానితులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐసోలేషన్, క్వారంటైన్‌లకు పంపించి కోవిడ్ వ్యాప్తి నియంత్రణకు చర్యలు తీసుకున్నాడు. అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే మందులను, మాస్కులను వారి ఇళ్లకే అందజేసి అండగా నిలిచాడు.

– సి.బెళగల్



కోవిడ్ సమయంలో ఫీవర్ సర్వే చేస్తున్న వలంటీర్ కురువ సోమప్ప (ఫైల్)

మాకు అండగా ఉంటాడు



మాకు ఏ పనులు కావాలన్నా వలంటీర్ సోమప్పనే కలుస్తాం. ప్రభుత్వం వారు ఇచ్చే పథకాలను ఎప్పటికప్పుడు మాకు తెలియజేసి వాటిని మేము పొందేలా చూస్తాడు. ప్రతిరోజు వీధిలో తిరిగి సర్వేలను చేసి, మాకు రావాల్సినవి వచ్చే వరకు సచివాలయంలో ఉండి పనిచేకునే వస్తాడు. మాకు ఎప్పుడు అందుబాటులో ఉండి, అవసరాలు, సమస్యలలో అండగా ఉంటాడు.

– ఆంజనేయులు, ముడుమాల

ఎంతో సాయపడ్డారు

కరోనా మహమ్మారి పేదల జీవితాన్ని అస్తవ్యస్తం చేసింది. నిరుపేదలు ఇంటి నుంచి బయటకు రాలేక పొట్ట నింపుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఇలాంటి దుస్థితిలో కర్నూలు నగర శివారులోని 38వ వార్డు, 99వ సచివాలయం పరిధిలోని సి2 క్లస్టర్ వలంటీర్ మాస్టిక్ ప్రతాప్ ప్రజలకు ఉత్తమ సేవలందించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. ఏంఏ బీఈడీ చదువుకున్న ఈ యువకుడు సామాజిక సేవలోనే సంతృప్తి ఉందని భావించి 2019లో వలంటీర్‌గా చేరాడు. నాలుగేళ్ల నుంచి ప్రభుత్వ పథకాలు, సేవల గురించి ఇంటింటికీ వెళ్లి తెలియజేసి అర్హులకు వాటిని అందజేస్తున్నారు. అనాథలు, నిరు పేదలకు కష్టకాలంలో తనవంతుగా నిత్యావసర వస్తువులు అందజేస్తూ సేవా దృక్పథాన్ని చాటుకున్నాడు. ఆ క్లస్టర్ పరిధిలోని ఎం.నాగలక్ష్మి కోడలు జ్యోతి 2022 జనవరి 6న కరోనా విపత్కర సమయంలో ప్రభుత్వాసుపత్రిలో కాన్పు కోసం వెళ్లారు. విషయం తెలుసుకున్న వలంటీర్ కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆసుపత్రి వద్దకు వెళ్లి నాగలక్ష్మికి వైఎస్సార్ పింఛన్ కానుక అందజేశాడు. అలాగే అదే రోజు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కరెంటు తిక్కన్నకు పింఛన్ సొమ్ము అందజేశాడు. –కర్నూలు (న్యూటౌన్)



కర్నూలు ప్రభుత్వాసుపత్రి కాన్పుల వార్డు వద్ద నాగలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మాస్టిక్ ప్రతాప్

కన్నకొడుకులా ఆదుకున్నాడు



మాది కర్నూలు నగర శివారులోని మునగాలపాడు గ్రామం. నా కోడలు జ్యోతి కరోనా సమయంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి కాన్పుకోసం వెళ్లాం. ఆసుపత్రిలోని కాన్పుల వార్డు వద్దకే వచ్చి మా వలంటీర్ మాస్టిక్ ప్రతాప్ వైఎస్సార్ పింఛన్ కానుక నగదును అందజేశాడు. కష్టకాలంలో కన్న కొడుకులా ఆదుకోవడం సంతోషంగా ఉంది.

–ఎం నాగలక్ష్మి, మునగాలపాడు గ్రామం

సంక్షేమ ఫలాలతో ఆర్థికాభివృద్ధి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

పాణ్యం: రాష్ట్రంలో పారదర్శక పాలనతో సంక్షేమ ఫలాలు ప్రతిఒక్కరికీ చేరుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పాణ్యంలోని సచివాలయం-3 పరిధిలో గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరువ చేశారన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా? లేదా? తెలుసుకుని మరీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో అందించిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని అధికారుల సమక్షంలో పరిష్కారం చూపుతున్నట్లు చెప్పారు.

ఎస్సీ కాలనీని అభివృద్ధి చేస్తాం

పాణ్యం ఎస్సీ కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించామన్నారు. శ్రీ వీరనారాయణ స్వామి-భృంఘీశ్వర స్వామి ఆలయం మధ్య రహదారిని బాగుచేయడంతో భక్తులు ఇబ్బందులు తొలగాయని చెప్పారు. కాలనీలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని కోరగా త్వరలోనే నిర్మించాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ ఏర్పాటుకు ఇంజినీర్లతో ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు జాకీర్‌ఉసేన్, డీలర్ నాగన్న, చందమామ బాబు, పుల్లయ్య, స్వామి, గౌడ్, తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, ఏపీఎం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకే భవనం ప్రారంభోత్సవం

మండలంలోని గోరుకల్లు గ్రామంలో రూ.28.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాన్ని గురువారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, రైతుల సంక్షేమం కోసం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. రైతులు ఆర్బీకేల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్బీకేలోని కియోస్క్ మిషన్‌లో ఎరువులు, విత్తనాలు ఆర్డర్ పెట్టే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. జడ్పీటీసీ సద్దల సరళమ్మ, మాజీ జెట్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ ఉసేన్‌బీష, ఏఓ జయప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.